కథ

టి.వి.ఎస్.రామానుజరావు

# సెల్లో జోలీగ

వీధిలో ఆటో ఆగిన చప్పుడవగానే దబ్బున లేచి ముందు గది తలుపుతీసి చూశాడు. ఎదురింటికి ఎవరో వచ్చారు. తలుపులు వేయబోతుండగా కారియర్ కుర్రాడొచ్చాడు. వాడి చేతిలో కారియర్ అందుకుని 'ఉస్సూ'రంటూ కుర్చీలో కూలబడ్డాడు ప్రవీణ్.

ఆర్నెల్లయ్యింది హారిక పురిటికని పుట్టింటికి వెళ్ళి. ఇవాళ బాబుని ఎత్తుకుని తను, అమ్మా వస్తున్నామంటూ నిన్న రాత్రి ఫోన్ చేసింది. ఆఫీసునుంచి తొందరగా వచ్చేసి ఎదురుచూస్తూ కూర్చున్నాడు ఆమె రాకకోసం.

టేబుల్‌మీద వుంచిన సెల్‌ఫోన్ మోగడంతో అందుకున్నాడు ప్రవీణ్.

"ఏమిరా బిడ్డా! నే చెప్పిన పని పూర్తిచేసినావు బే?" అడిగిందొక బొంగురుగొంతు.

"ఏం పని?" అయోమయంగా అడిగాడు.

"అరే, బద్మాష్! ఏ పనని అడుగుతుండావు బే! మాకొక కుర్రనాయాలు అడ్డొస్తున్నాడు. అణ్ణి లేపెయ్యమని నీకు చెబితిని గదరా! అప్పుడే మర్చిపోయినావురా? నీకు దబ్బులు ఇస్తిని గదరా?"

"ఎవరయ్యా నువ్వు? నాకు దబ్బులివ్వడమేంటి? నేను నువ్వనుకున్న రౌడీని కాదు బాబు. రాంగ్ నెంబర్!" అంటూ కంగారుగా సెల్‌ఫోన్ ఆఫ్ చేశాడు ప్రవీణ్.

మళ్ళీ ఫోన్ మోగింది. తనకిష్టమైన పాటది. రింగ్‌టోన్‌గా హారిక సెల్‌నుంచి వచ్చే కాల్స్‌కి గుర్తుగా డౌన్‌లోడ్ చేసుకున్నాడు తను.

"హలో హారికా! ఏమైంది. ఇంకా రాలేదేంటి? అసలు బయలుదేరారా, లేదా? నీకోసం ఎంతగా ఎదురు చూస్తున్నానో తెల్సా?"

చిన్నగా నవ్వు వినబడింది సెల్‌లో. బహుశా ఉమ అయ్యుంటుంది.

"బావగారూ, అంత ఆత్రం పనికిరాదండి! మా అక్కా, అమ్మా ఎప్పుడో బయల్దేరారు. ఈపాటికి వచ్చే వుంటారనుకున్నాను. పాపం ఆర్నెల్లనుండి విరహం అనుభవిస్తున్నట్టున్నారు. హోటలు భోజనం, మఠం నిద్ర. ఇంచక్కా నన్ను కూడా చేసుకుంటే ఈ తిప్పలు తప్పేవి కదా!"

"ఏయ్ పోకిరిపిల్లా! ఇంకా చిన్నపిల్లవనే అనుకుంటున్నావా? మరీ అతివాగుడు ఎక్కువైంది. సినిమాలో హీరోయిన్ చెల్లెల్లా" కేకలేశాడు ప్రవీణ్.

"ఇప్పుడైనా నేను హీరోయిన్ చెల్లెల్నే గదా! అసలు నేనే మా అక్కతో అక్కడికి వచ్చి, మీ యింట్లో తిష్టవేసి, మీ ప్రేమ సామ్రాజ్యంపై థీసిస్ రాద్దామనుకున్నాను"

"రక్షించావు. ముందిది చెప్పు. మీ అక్కావాళ్ళు ఎన్నింటికి బయలుదేరారు?" అంటుండగానే తలుపు చప్పుడైంది. ఫోను టేబులుపై వుంచి వెంటనే తలుపు తీశాడు.

ముందు హారిక, వెనక బాబునెత్తుకుని అత్తగారు లోపలికి వచ్చారు. సూట్‌కేసులు, బ్యాగులు లోపల పెట్టించి ఆటోవాడికి దబ్బులిచ్చి పంపేశాడు ప్రవీణ్.

"బయల్దేరే ముందు ఫోన్ చెయ్యొచ్చుగా" అలకగా అన్నాడు.

హారిక జవాబిచ్చేలోగా అత్తగారు చెప్పింది. "ముందే చెప్పానుబాబు దీనికి, ఫోన్ చెయ్యవే అని! బస్ ఎక్కాక సెల్ నుంచి చేస్తాలే అంది. తీరా బస్సెక్కాక మర్చిపోయాను సెల్ ఇంట్లో అని చెప్పింది"

"అన్నట్టు నాన్నగారికి క్షేమంగా ఇల్లు చేరినట్టు ఫోన్ చెయ్యాలండి" అంది హారిక.

దబ్బున టేబుల్ పైన పెట్టిన సెల్ తీసి చూశాడు. అవతల ఉమ యింకా లైన్లోనే వుంది.

"ఫోన్ స్విచ్చాఫ్ చెయ్యడం మర్చిపోయాను" అన్నాడు ప్రవీణ్.

"ఎవరండీ?" అడిగింది హారిక.

"ఇంకెవరూ నీ ముద్దుల చెల్లెలు!" అన్నాడు ప్రవీణ్.

"ఫోనివ్వండి" అంటూ తీసుకుని "ఉమా క్షేమంగా చేరామని నాన్నగారితో చెప్పవే" అంటూ చెప్పింది ఉమతో.

"అలాగేలే కానీ, యిందాకటి నుంచి చూస్తున్నా అదే వింటున్నా! ఆర్నెల్లయ్యింది కదా మీరిద్దరూ విడిగా కాపురాలు పెట్టి! చూడగానే ఎగిరిగంతేసి ముద్దెట్టుకోదాలు, కాసింత ప్రేమగా కౌగలించుకోదాలు ఏమీ లేవా?"

"నోర్మూయ్యవే సన్నాసీ!" చిరుకోపంతో అంది హారిక.

"అలాగేలేమ్మా! పెళ్ళయ్యేదాకా అందరూ సన్యాసులే! అయినా ఇంతసేపు లైన్లో వున్నందుకు నాకీ బిరుదిస్తావా! కొంచెమైనా ముద్దూ ముచ్చట లేదే నీకు"

"చంపుతా యింక మాట్లాడావంటే" అంటూ హారిక ఫోన్ కట్ చేసింది.

భోజనాలైనాక హారిక తల్లికి వేరే గదిలో పడక ఏర్పాటు చేసింది. వంటిల్లు సర్దేసి, తమ గదిలోకి వచ్చింది. తలుపేసి తిరిగేలోగా ప్రవీణ్ చేతుల్లో వాలిపోయిందనేకంటే ప్రవీణ్ ఆమెను తన దగ్గరికి లాక్కున్నాడనడం నిజం. అతని తొందరకు మురిపెంగా కోపగించుకుంటూనే అల్లుకుపోయింది.

ఇంతలో సెల్‌ఫోన్ మోగింది. హారిక వెంటనే ఫోన్ తీసింది. "మా నాన్నగారేమో" అంటూ.

"హలో డార్లింగ్! వీడికి అదే, ఈ ఆటోవాడికి మన యింటి అడ్రసు చెప్పవే! నేనేం చెప్పినా వీడికి అర్థం అయ్యి చావడం లేదు. కుతూబ్ మీనార్ పక్కనందులో అంటే, అది ఢిల్లీలోవుంది అంటాడు. పోనీ అలంకార్ టాకీస్ దగ్గరకు తీసుకెళ్ళమంటే అది విజయవాడలో కదా అంటాడు. తాగొచ్చినట్టున్నాడు వెధవ" మత్తుగా పలికిందో గొంతు.

హారిక కంగారుపడి "ఏమండీ, చూడండి. వీడెవడో ఏదో మాట్లాడుతున్నాడు" అంటూ ఫోన్ అందించింది ప్రవీణ్‌కు.

"ఎవడ్రా నువ్వు? నా పెళ్ళాం నిన్ను ఏవండీ అంటోంది?" మత్తులోనే అరిచాడు అవతలి మనిషి.

ప్రవీణ్‌కు చిర్రెత్తుకొచ్చింది. "ఒరేయ్ తాగుబోతు వెధవా! నువ్వు చేసింది మీ యింటికి కాదు. మా యింటికి. రాంగ్ నెంబర్ చేశావు! నెంబర్ సరిగ్గా చూసుకో" అన్నాడు కోపంగా.

"నిన్నూ దాన్ని నరికేస్తానోయ్! నా పెళ్ళాంతో కులుకుతున్నావురా! వస్తున్నా వుండు" అరిచాడు అవతలి వ్యక్తి.

"ఒరే రాస్కెల్! నీ నెత్తిన బిందెడు నీళ్ళు పోసుకుని చూడు, మీ ఆవిడ ఫోన్ నెంబరు. చంపుతా యింకా వాగావంటే. అసలుండు, ముందు పోలీసులకు ఫోన్ చేస్తా, తాగి ఫోన్‌లో అల్లరి చేస్తున్నావని. ఎక్కడున్నావు నువ్వు? నీ పేరేంటి?" అరిచాడు ప్రవీణ్ కోపంగా.

వెంటనే అవతలి వ్యక్తి సెల్ కట్ చేశాడు. 'అమ్మయ్య' అనుకుంటూ ప్రవీణ్ సెల్ పక్కనపెట్టి హారిక వైపు తిరిగాడు.

"ఇన్నాళ్ళు నేను లేకుండా ఎలా వున్నావు? నాకైతే రోజూ ఒక యుగంలా గడిచింది" అన్నాడు.

ఇంతలో సెల్ మోగింది మళ్ళీ. "తీయండి" నవ్వింది హారిక.

"వాడే అయ్యుంటాడు" అంటూ సెల్ తీసి తిట్టబోయాడు ప్రవీణ్.

అయితే అవతలి గొంతు వేరు.

"హలో, ప్రభాకర్! ఇవాళ పార్కుకు రాలేదేం? నీ కోసం ఎంతసేపు చూశానో తెల్సా. నిన్న గోడదూకి లోప లికి వచ్చానని మా దున్నపోతు వార్డెను నాకు వార్నింగు ఇచ్చింది. లేటుగా వస్తే, మా యింటికి ఫోన్ చేస్తానని చెప్పింది. అందుకే ఎనిమిదింటిదాకా చూసి హాస్టల్‌కు వచ్చేశాను."

"చూడమ్మా! నువ్వు గోడలు దూకిన వైనం నీ లవ ర్‌కు విడిగా చెప్పుకో. ఇలా సెల్‌ఫోన్లో రాంగ్‌నెంబర్లకు కాదు!" అన్నాడు ప్రవీణ్.

"అయ్యో, ఇది ప్రభాకర్ నెంబర్ కాదాండీ!" అడి గింది అవతలి గొంతు.

"చూడమ్మాయ్! నీ పేరేంటో నాకు తెలీదు. ప్రభాకర్ ఎవడో, వాడి ఫోన్ నెంబరెంతో నాకు తెలీదు. నేను, మా ఆవిడా ఆర్నెలల తర్వాత కలుసుకున్నాం. మాట్లా డుకుందామని ఇందాకటినుండి తెగ ప్రయత్నిస్తున్నాం. ఒకటే రాంగ్ నెంబర్ ఫోన్లు. ఇక సెల్ స్విచ్చాఫ్ చేసి పడుకో తల్లీ, మా ప్రాణం తియ్యకు" అరిచాడు.

హారిక నవ్వింది ప్రవీణ్ కోపం చూసి. ఇంతలో బాబు నిద్రలేచాడు. ఏడవడం మొదలుపెట్టాడు.

హారిక బాబును తీసుకుని పాలిచ్చి, వుయ్యాలలో పడుకోబెట్టింది.

"చిన్నగా మాట్లాడండి, బాబు లేస్తాడు" మెల్లిగా చెప్పింది.

"ఓహో, ఇవి కొత్త ప్రాణి షరతులు కాబోలు" వ్యక్రో షంగా అన్నాడు. 'గుర్ గుర్' అంటూ ఫోను ఓ అంగుళం జరిగింది.

"మళ్ళీ ఏమొచ్చింది రోగం" అంటూ ఫోన్ తీసి చూశాడు ప్రవీణ్.

'ఫలానా నెంబర్ కాల్‌కు మీకు ఆర్రూపాయలు కట్' అంటూ మెస్సేజ్ వచ్చింది.

"నేనేం చెయ్యాలా" అని అరవబోయాడు. బాబులేస్తా డని నోరు నొక్కుకున్నాడు. 'ఈ మహాతల్లి కాల్ రోమింగ్ ఛార్జీలు కూడా నాకేనా' అంటూ సణుక్కున్నాడు. హారిక అతనివంక ఆశ్చర్యంగా చూసింది.

మళ్ళీ గుర్, గుర్ మంది ఫోను. ప్రవీణ్ కోపంగా చూశాడు దాని వంక:

"స్టాలిన్ రింగ్ టోన్స్ కావాలంటే 123 నొక్కండి" అంటూ మెస్సేజ్.

"నీ పీక నొక్కుతా, నాకేం అక్కర్లేదు ఫో" అన్నాడు కోపంగా.

ఎవర్నన్నాడో అర్థం కాలేదు హారికకు.

"ఏమిటండీ?" అడిగింది.

"రింగ్ టోన్సట! ఎవడిక్కావాలి?" అన్నాడు కోపంగా.

"పోన్లెండి, వదిలెయ్యండి" అంటూ అతనికేసి తిరి గింది హారిక.

ఇంతలో మళ్ళీ ఫోను! ఎవరోనని చూస్తే తన నెంబరే! హారిక వెంటనే ఫోన్ తీసింది.

"హేపీ, హేపీ నైట్ అక్కా" అంటూ ఉమ నవ్వుతూ ఫోన్ పెట్టేసింది.

"ఈ వెధవ ఫోను ఎప్పుడు తీసుకున్నానో తెలీదు గాని, అప్పటినుంచి బిల్లులతోటీ రాంగ్ కాల్స్‌తోటీ మన శ్శాంతి లేకుండాపోయింది. ప్రతి నెలా నీ ఫోన్ బిల్లు మూడు వేలు దాటుతోంది. ఇప్పుడు ఫోన్ అక్కడ వదిలేసి వచ్చావు. నీ



చెల్లెలు వీణ వాయించినట్లు కాల్స్ వాయిస్తోంది" అన్నాడు ప్రవీణ్ కసిగా.

మళ్ళీ ఫోన్ గుర్, గుర్ మంటూ జరిగింది పక్కకు.

ప్రవీణ్ ఫోన్ తీసి చూశాడు. "రేపు తొమ్మిదింటికల్లా సిద్ధంగా వుండు. బాస్ అప్పచెప్పిన పని మనం రేపే పూర్తి చెయ్యాలట" అంటూ కొలీగ్ సుబ్రావ్ నుంచి మెసేజ్!

జుట్టు పీక్కోబోయాడు ప్రవీణ్.

"అదిగో అదే వద్దు. ఈ గిరజాల జుట్టు చూసేగా నేను మిమ్మల్ని చేసుకుంటానికి ఒప్పుకుంది. ఇలా జుట్టుపీ క్కొని బాల్డ్‌హెడ్ అయితే నేను మా యింటికి వెళ్ళిపో తాను" కోపంగా అంది హారిక.

"ఇది సెల్లుకాదు గిల్లు! చెవిలో జోరీగ!" అంటూ దాన్ని విసిరేశాడు ప్రవీణ్.

"పీడా వదిలింది" అంటూ హారిక అతని వొళ్ళో వాలి పోయింది.